


కథానిక

రైలు రావడానికి ఇంకా గంటవ్యవధి ఉన్నది సక్రమంగా రైలువస్తే. నన్ను స్టేషనుకి తీసుకొచ్చిన బండీ తిరిగి వెళ్ళిపోయింది కూడా. అనవసరంగా త్వరగా వచ్చేశాననిపించింది.

నమ్మకం చాలక మరోకసారి నా గడియారం వేపూ, స్టేషనుమాస్టరు గడియారంవేపూ చూశాను. పాడు గడియారాలు – నా భయాలన్నిటినీ నిజం చేస్తూ సరిగానే ఉన్నాయి.

స్టేషనుమాస్టరు కునికిపాట్లు పడుతున్నాడు. ఓ గుమాస్తా కిటికీ దగ్గర కూర్చుని హిందూ పేపరంతంతఫారాలు నింపుతున్నాడు. నాలుగురోజులనించి పల్లెలో గడిపి గడిపి, విసిగి ఉన్ననాకు ఈ మానవఐశ్వ్యయం మరీ అధ్వాన్నంగా కనిపించింది. అయినా బద్ధకంగా గుమస్తా దగ్గరకి వెళుతూ, "పేసింజర్ వొచ్చేది ఎన్ని గంటులకండీ?" అన్నాను.

"అయిదూ ఇరవైమూడు" అన్నాడు గుమస్తా తల ఎత్తకుండానే.

మనిషి చూడడానికి విచిత్రంగా ఉన్నాడు. దువ్వనవసరంలేని మోటుజుత్తు, చిరుగులను దాచడానికి వేసినకోటూ, దానితో చాలా సంబంధం లేని పేంటూ, రాత్రంతా నిద్రలేనట్లు ఎర్రబడిన కళ్లూ మనిషి వెనకాల చాలా కథలు ఉన్నట్లు కనిపించాడు.

"కరెక్టుటైమా?" అన్నాను ఎలాగైనా సంభాషణని పొడిగించాలని. ఈ మారుమూల స్టేషనులో ఈ వింతవిగ్రహం వెనకాల ఉన్నకథని దేన్నయినా వ్రాసి లోకానికి అందించగలిగితే, ఎంత సంతృప్తిగా ఉంటుంది! అతని కళ్ళల్లో మెదులుతూన్న అనుమానాలూ, చీకట్లూ తప్పక ఏదో ఒక గాథని దాచుకునే ఉంటాయి. ఎలాగైనా సంభాషణని పొడిగిస్తే...

"అవును" అన్నాడు గుమాస్తా, తన కలపడాలూ, కూడికలూ, కొట్టివేతల సముద్రంలో ఈదులాడుతూ. ఓడిపోయాను మొదటి ప్రయత్నంలో. అధమం పేజింజర్ ఆలశ్యం అయినా బాగుండును— ఆ కారణంకోసమైనా ఇతనిని మాటలాడించ వొచ్చునని...

"ఈ దగ్గరగా కాఫీ దొరుకుతుందండీ?" అన్నాను ఇంకా నా ప్రయత్నం సాగిస్తూ.

"దొరకదు" అన్నాడు గుమాస్తా. అని ఓసారి తలఎత్తి చూశాడు నావైపు. కొంచెం విజయం కలిగింది కనుక సంతృప్తిపడి, "రైల్వే స్టాల్ లేదా?" అన్నాను దాన్ని గురించిఅయినాఉపన్యాసం ఇస్తాడేమోననిఆశిస్తూ.

"లేదు" అని, పూర్వంకన్న తీవ్రంగా తన గణిత పరిజ్ఞానం పరీక్షచేసుకుంటూన్నట్లు సాగిపోయాడు గుమాస్తా. ఎంత ప్రయత్నించినా ఇంక ఈ మానవుణ్ణి సంభాషణ లోనికి లాగడం అసంభవం అని నిర్ధారణ చేసుకున్నాను. కథలు రాసుకోనేందుకు పనికివచ్చే మనిషి అయితే, నన్ను చూడగానే రైళ్ళ రాకపోకలని గురించీ, పూర్వ ప్రస్తుత ప్రయాణాల విభేదాలనిగురించీ, జోనల్ సిస్టమ్ బాగోగులనిగురించీ, బెంగుళూరు సెక్రటరీ అభివృద్ధిని గురించీ తప్పకుండా ఉపన్యాసం ప్రారంభించి ఉండును...

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

పూర్తిగా ఓటమిని అంగీకరించి బయటికి నడిచాను. అయిదారుగురు పోర్టర్లూ, నామల్లేనే త్వరగా వొచ్చిన పది పన్నెండూ మంది ప్రయాణీకులూ, ప్లాట్‌ఫారమ్‌మీద కొంచెం సందడి చేస్తున్నారు. అందరివైపూ చూశాను. నాకు పనికొచ్చే జీవి ఎవరూ కనిపించలేదు.

పోనీలే... అనుకున్నాను. ఈ మధ్య వాస్తవికతనించి రచయితలూ క్రమంగా దూరం అవుతున్నారు. ఇట్లా కథలు వినీ, కనీ, రాసేస్తే, అది కథారచన కాదనీ, న్యూస్ రిపోర్టింగ్ అనీ...

అట్లా ఆలోచిస్తూ ప్లాట్‌ఫారమ్ కొసనివున్న పెద్ద చెట్టుక్రిందికి వెళ్ళి కూర్చున్నాను. స్టేషను చుట్టూ కొండలు ఉండడాన్న ఎండ మందంగా వొస్తూంది. ప్రయాణీకులంతా అవతలి కొసకి ఉన్నారు. ప్రశాంతంగా కూర్చుని, మనసుకి సుఖం కలుగజేసే ఇలాంటి ఆలోచనలు సాగించుకున్నాను.

అయితే, ఈ ఆలోచనల ప్రవాహం చాలాసేపు సాగలేదు. నేను కూర్చున్న చెట్టుకి అవతల వైపునించి గాజుల చప్పుడు వినిపించి, త్రుళ్ళిపడి అటుచూశాను. చారలచీర కట్టుకుని, ఓ అమ్మాయి నిజంగా అక్కడ కూర్చుంది.

మొదట కలయేమో ననుకున్నాను. ఈ మధ్య నిజంగా కనిపించేవాళ్ళూ, కథల్లోని కన్యలూ కలిసిపోతున్నారు. అట్లాగ...

నన్నూ ఆ అమ్మాయి అప్పుడే చూసినట్లుంది. ఓసారి తల ఎత్తిచూసి, తిరిగి చదువుతూన్న పుస్తకంలో లీనం అయింది. ఈమెతోనైనా కాస్త సంభాషణ సాగిద్దామని ఆశించాను. కాని, చల్లగా ఆమె తన పుస్తకంలో కలిసిపోవడంతో ఈ ఆశా కరిగిపోసాగింది.

సంచీలోనుంచి నాపుస్తకంతీసుకుని, క్రమంగా నేనూ ఆ నల్లటి అక్షరాల మధ్య పరిగెత్తడం ప్రారంభించాను—ఉన్న ఒక్కదారీ అదే కాబట్టి. కథలు వినడమూ, వాటిని వ్రాసుకోవడముకన్న చదువుకోవడం చాలా సులువు; సంవత్సరాల తరబడి ఆలోచించి, ఉద్రేకాలు అనుభవించి మానవజీవితాన్ని తరిచి, మనస్సుని మధించి వ్రాసిన గ్రంథాలు రెండురూపాయిల ఖరీదుకి వొచ్చి, రైలు ప్రయాణంలో తలనొప్పి రాకుండానూ, మాటలాడడాని కెవ్వరూ లేనప్పుడు మాటలాడడానికీ పనికివస్తాయి.

అయిదారునిమిషాలు చదివాననుకుంటాను.

ఒక కర్రకాలు శబ్దంచేసుకుంటూ ఒక ముష్టివాడు మావైపు వొస్తున్నాడు స్టేషన్‌నించి. ఆ శబ్దానికి నా దృష్టి అటుపోయింది. నవలలో నాయకుడు చెట్లమధ్య కుర్చీలో కూర్చుని సిగార్ కాల్చుకుంటూ ఆలోచిస్తున్నాడు. కొద్ది నిముషాలు నేనూ నాయకుడితో అట్లా ఆలోచిస్తూంటే ఈ ముష్టివాడు....

వాడిమీద నాకు పూర్తిగా కోపం వొచ్చేలోగా వాడు దగ్గరికిరానే వచ్చాశాడు. వాడిని పరీక్షగా చూడడంకూడా నేను వుండ లేకపోయాను—నా ప్రశాంతతని పాడు చేశాడన్న కోపంలో.

“బాబూ!” అన్నాడు వాడు నెమ్మదిగా.

“ఏం?” అన్నాను.

“బీదవాడిని బాబూ!...”

వాడిమాటలు జాలికన్నా కోపం ఎక్కువ కలుగజేస్తున్నాయి. ఈ మాటలని నేను వింటోన్నట్లే అనిపించకుండా, “అలాగా!” అన్నాను.

“ఇల్లు కాలిపోయింది బాబూ!”

“పాపం!”

“ధర్మప్రభువులు...”

“అదెవరూ?”

వింటోన్నట్టుంది అమ్మాయి కుక్కున నవ్వింది. చికాకుగా నేనన్నమాటల్లో ఉన్నది హాస్యం కాదనీ, వ్యంగ్యం అనీ ఈమెకి ఎలా తెలుస్తుంది?

“తమరె బాబూ!”

“నీకేలా తెలుసు?”అన్నాను నిరభ్యంతరంగా చెప్పిన వాడి ఉద్దేశానికి కొంచెం నవ్వుకుని.

“మిమ్మల్ని చూస్తే తెలుస్తుందండి.”

ముష్టివాడునవ్వలేదుకాని అమ్మాయి నవ్వింది. వాళ్ళకోసం కానప్పుడు ఆడవాళ్లు అన్నిటికీ నవ్వుతారు-వాళ్ళని నవ్వించదలచుకుంటే మాత్రం...

“ఎలాగా?” అంది, ఆమెకూడా సంభాషణలో ప్రవేశిస్తూ. ఈ కథాగమనం మొదట అయితే నాకు సంతోషంగా ఉండి ఉండును కానీ, నా నాయకుణ్ణి అట్లానే వొదిలిపెట్టి ఈ వ్యవహారాన్ని సాగించడం నాకు యిష్టంలేదు.

అమ్మాయి సంగతి, స్టేషన్‌లోని మానవులని గురించి నేనేదో ఒక అభిప్రాయం ఏర్పరచుకొనే ఉన్నాను. ఆమెతో పరిచయం చేసుకోవాల్సిన అవసరంకూడా ఏమీలేదింక.

"వారినిచూస్తే తెలుస్తుందండీ" అన్నాడు ముష్టివాడు—కొంచెం గట్టివాడల్లేనే ఉన్నాడు.

"నేను నీకొక్క దమ్మిడీ ఇవ్వను. నన్నింక గోలచెయ్యకపో—ఈ చుట్టూకనిపించక, త్వరగా పో..." అన్నాను.

"ఇల్లుకాలిపోయిందండి...ధర్మప్రభువులు.."

మళ్ళా మొదలెట్టాడు. అమ్మాయి నవ్వుతూనే ఉంది. ఒక అణా ఇచ్చి వొదిలించుకుందామా అనుకున్నాను. కాని ఆత్మగౌరవం అడ్డువొచ్చింది.

కసురుకున్నాను. వాడు తెల్లబోయి "పోనీండి బాబూ!" అని వొచ్చినదారినే వెళ్ళిపోయాడు.

హఠాత్తుగా వచ్చిన నా కోపానికి కొంచెం ఆశ్చర్యపడినట్లుంది...ఆ అమ్మాయి వింతగా మళ్లీ నా వైపూ, నా పుస్తకంవైపూ చూడసాగింది. ఆ చూపులమధ్య సుళువుగా నా పనిమీదికి తిరిగి దృష్టిసారించడం కష్టంగానే కనిపించింది.

కొద్దిక్షణాల్లోనే గడిచిపోయాయి-నిశ్శబ్దంగా. బహుశా ఇరువురమూ రెండోవాళ్ళ భావాలని-తెలీని లోతులదాకా తరిచి ఆలోచిస్తూ గడుపుతున్నామనుకుంటాను.

"మీ రెక్కడిదాకా వెడుతున్నారూ?"

అన్నాను-మిగిలిన ప్రశ్నలన్నిటినీ అడిగివేసినట్లు, ఎలాగో సంభాషణ సాగించడం అవసరంకనుక.

"మీరు?" అన్నదామె.

"బెజవాడ..." అన్నాను.

"నేనుకొంచెం ఎక్కువలెండి" అన్నదామె-సరీగా గమ్యస్థానం పేరుచెప్పడం ధర్మసూత్రాలకి విరుద్ధం అన్నట్లు.

ఆమె నవ్వడంలేదు...ఏదో ఆలోచిస్తున్నట్లు రైలుపట్టాలకేసి చూస్తూ కూర్చుంది. నీలమేఘం కాకపోయినా మొత్తంమీద నలుపులోకివచ్చేరంగు ఊదారంగు బోరలచీర కట్టుకుని, జాకెట్ వేసుకున్నది. లక్షణాలన్నీచూస్తే ఎక్కడో పని చేస్తోన్నదల్లేవుంది.

"మీరేం చేస్తూంటారు?" అన్నది, కొన్ని సెకెండ్లయాక ఆమె-తిరిగి సంభాషణ ప్రారంభించడానికి ప్రయత్నంచేస్తోన్నట్లు.

నిరుద్యోగిపోలేదా వెల్లడించుకోవడం ఇష్టంలేక, "కథలురాస్తూ ఉంటాను" అన్నాను.

"నిజంగా?" అందామె-నాలాటి మనిషి ఏజన్మానా కథలువ్రాయడం అసంభవం అయినట్లూ నేనుచేసేపని అదితప్ప మరేమైనా అవొచ్చునన్నట్లూ.

"మీతో అందరూఅబద్ధాలాడుతుంటారేం?" అన్నాను కొంచెం కటువుగానే.

"అదికాదులెండి-కథలురాసేవాళ్ళని చూడాలని చాలా రోజులనించి అనుకొంటున్నాను. వాళ్ళిలాగ ఉంటారని నే నెప్పుడూ అనుకోలేదు-" అన్నదామె.

"వాళ్ళకి నాలుగు చేతులూ, రెండు తలకాయలూ ... ఇవన్నీ ఉంటాయనుకున్నారా?" అన్నాను నవ్వుతూ.

"పెద్దతలకాయి ఒక్కటీ, ఒకచెయ్యిమాత్రం ఉంటుందనుకున్నాను" అంది అమ్మాయి - తనూ నవ్వుతూ.

"మీరూ కథలురాయడం మొదలు పెట్టండి" అన్నాను - సంభాషణ ఎట్లాగైనా పొడిగించడానికి.

"అదొక్కటే తక్కువనాకు!...మీకథలకి డబ్బు ఇస్తారనుకుంటాను పత్రికలవాళ్లు ... నా కథలు వినడానికే మనిషి దొరకడు!" అందామె ఒక నిట్టూర్పు విడుస్తూ

"మీరు చాలా కష్టాలు అనుభవించిన మనిషిలాగా మీ ఆకృతినిబట్టిచెప్పడం కష్టం" అన్నాను. ఇక్కడేదో కథకి విత్తనం ఉందని తెలీగానే.

"అదేమరీ దురదృష్టం!" అని వాపోయిందా అమ్మాయి.

కష్టపడి నేనూ కొంచెం జాలిపడ్డాను. ఈ నటన అంతా చివరికి ఫలవంతంఅవుతుందని నాకు తెల్సును. ఆ అమ్మాయి తన కథని నాకు చెప్పడానికి ఆత్రుతపడుతోందని తెలిసిపోతూనే ఉంది!

"మీకు అభ్యంతరం లేకపోతే మీ కథని వినాలనిఉంది" అని నేననలేదు-మరీ కన్వెన్షనల్ గా ఉంటుందని... "బహుశా మీరు మీ ఇంటికి

తిరిగి వేడుతున్నారు" అన్నాను ఆమెని చూసి గ్రహించినట్లు.

ఆమె ఆశ్చర్యపోయింది. "ఎంత బాగా కని పెట్టేరండీ!...నిజంగా అంతే" అన్నది.

ఆ క్షణంలో కథకుడుగా నా గౌరవం, గొప్ప తనమూ, కొన్ని రెట్లు అయాయనుకుంటాను. కొంచెం డిటెక్టివ్ పవర్ కూడా కథకుడికి ఉండా లని ఎవరో అనేఉంటారు. అది నా విషయంలో సార్థకం అయి ఊరుకుంది.

ఆ తరవాత ఆమె కథని రాబట్టడానికి నా కేమీ శ్రమకలగలేదు.

*  *  *

ఇందిర ఇద్దరు పిల్లలలో రెండోది తల్లిదండ్రు లకి. చిన్నప్పటినించీ విపరీతంగా పెంకితనమూ, పట్టుదలా అలవాటుపడ్డాయామెకి- తల్లీ, తండ్రీ మరీ గారాబు చెయ్యడంవల్ల. చిన్నప్పుడు ఆమెకి ఈ పద్ధతుల్లో నష్టమూ, కష్టమూ ఏమీ కనిపిం చేదికాదు. వాళ్లు స్వతహాగా డబ్బు ఉన్నవాళ్లు. ఆమె తండ్రికూడా ఉద్యోగం చేసి ఆర్జిస్తూఉండే వాడు.

ఆ గారాబంతోనే, పెంకితనంతోనే, ఇందిర క్రమంగా పెద్దదైంది. కాలేజీలో ప్రవేశించేసరికి ఆమెలోని స్వోత్కర్ష మరీ హెచ్చయింది... తనేదో ఘనకార్యం చేసేస్తూన్నట్లు, మిగిలినవాళ్లు తనకి జోహారుచెయ్యాలన్నట్లూ ఆమె భావించి ప్రవర్తించేది. క్రమంగా ఆమె తన స్నేహితులం దరికీ దూరం కాసాగింది.

బి. ఏ.లోకి వచ్చేసరికి ఇందిరకి స్నేహితులు మిగలనేలేదు - రామస్వామి తప్పిస్తేను. అతను ఇందిర అంటే ప్రాణాలుపెట్టేవాడు. ఆమె చెప్పినదానికల్లా "ఊఁ" కొట్టేవాడు. ఏం కావా లన్నా చేసేవాడు.

ఇందిర బి. ఏ. ఒక్కపార్టుకూడా పేసవలేదు. రామస్వామితో సినిమాలకీ షికార్లకీ తిరగడానికే ఆమె కాలం సరిపోలేదు! రామస్వామికూడా యథాశక్తి, రెండుపార్టులు పోగొట్టుకున్నాడు

చదువులో ఆమె ప్రగతి చూసి, తల్లిదండ్రీ ఆమెకి పెళ్ళిచేసేద్దామనుకున్నారు. సరియైన వరుణ్ణిచూసి పెళ్ళి కుదిర్చారు.

మిస్ ఇందిర బి. ఏ.కి అక్కడ గొప్ప కోపం వచ్చింది. తాను రామస్వామిని తప్పిస్తే మరెవ రినీ పెళ్లిచేసికోనని భీష్మించుకుని కూర్చుంది. ఆమె రామస్వామిని పెళ్లిచేసుకొనేంతలాగ ప్రేమించలేదుగాని, ఈ పెళ్లికి అంగీకరించడం మాత్రం వీలుపడదని, తన ఉద్దేశంలో రామస్వామి ఉన్నట్లు తెలియజేసింది.

ఇందిర తండ్రి ఆమె అన్నదానికి దేనికీ అడ్డు పెట్టకపోయినా, ఈవిషయంలో మరీ పట్టుదలగా ఉండిపోయాడు. దానికి కారణం లేకపోలేదు- రామస్వామి తండ్రి బ్రతికిఉన్నరోజుల్లో ఇందిర తండ్రితో గొప్ప, పేచీపెట్టుకున్నాడు- ఇందిర తండ్రి అతన్ని దుంపనాశనంచేసి వొదిలిపెట్టేడు.

"ఇవన్నీ నిజమేనా?" అని రామస్వామిని ఓనాడు అడిగింది ఇందిర.

"అక్షరాలా" అన్నాడు రామస్వామి.

అయితే అతన్ని పెళ్ళాడడం తప్పదనుకుంది ఇందిర - ఎప్పుడో జరిగిన అన్యాయం కొంతైనా తగ్గిద్దామని.

ఏమైనా తానన్న పెళ్ళి జరగాల్సిందేనన్నాడు ఇందిర తండ్రి.

ఏమైనా తానన్న పెళ్లి జరగాల్సిందే నన్నది ఇందిర.

చివరికో శుభోదయం చూసి ఇందిరా, రామ స్వామీ లేచిపోయారు. ఇందిరకి లోకంమీద పగ తీర్చుకున్న సంతోషం మిగిలింది కాని త్వర లోనే ఈమెకి కొత్తకొత్త విషయాలు తెలియ సాగాయి

"పెళ్ళి చేసుకుందాం" అంది ఇందిర.

"పెళ్లెందుకూ?" అన్నాడు ఆశ్చర్యంగా రామస్వామి.

ఇందిర తెల్లబోయింది.

క్రమంగా రామస్వామి ఇందిరమీదకోపంగా అసహ్యంగా ప్రవర్తించసాగాడు. ఇందిరకి ఇది అంతా యేమీ బోధపడలేదు. ప్రేమ మీరాయి ఆమె ఇలాంటి కత్తీ నూనె సరుకని కలకూడా కనలేదు.

"నువ్వు నన్ను ప్రేమించడంలేదు" అని ఓ నాడు వాపోయింది చివరికి

"సత్యం గ్రహించావు" అన్నాడు.

"మరి నన్నెందుకు లేవదీసుకొనివచ్చావు?" అన్నది ఇందిర.

అప్పుడు ఉన్న రహస్యం కాస్తా బయటు పడింది.

రామస్వామి ఇందిరని లేవదీసుకొచ్చింది ఆమెని ప్రేమించడానికీకాదు, పెళ్ళి చేసుకోడానికీకాదు తన తండ్రిమీద ఆమెతండ్రి చేసిన నేరానికి ఈ విధంగా —ఆమెని లేవదీసుకొనివచ్చి— అతను ప్రతీకారం చేశాడు అంతే.

మర్నాడు ఇందిర బయలుదేరింది... ఇంటికి కాదు, మరో బంధువు ఇంటికి. అతను ఆమె తండ్రికి ఉత్తరం రాసి. ఆమెని ఇంటికి పంపేడు.

ఇంటికి వెడుతూ ఆ స్టేషనులో ఆమె రైలు కోసం ఎదురుచూస్తోంది.

అంతా చెప్పి ఇందిర వేడినిట్టూర్పు విడిచింది.

"చాలా మోసపోయారు!" అన్నాను.

"తప్పు నాదేలెండి. చివరికి చేతిలో పైసా లేకుండావచ్చాను. అతన్ని ఎలాగా అడగను— చుట్టాలని అడగలేను. చూడండి!" అని వాపోయి మరో నిట్టూర్పు విడిచింది సుదతి.

"పాపం!" అని, "కావలిస్తే నాదగ్గరనుండి కొంత డబ్బు తీసుకోండి" అన్నాను.

"మీ దగ్గర నుంచా! మీకు శ్రమ అవుతుం దేమో?" అంది సంకోచిస్తోన్నట్లు నటించడానికి ప్రయత్నిస్తూ.

"బాధ లేదులెండి" అని, పర్సులోనించి ఐదు రూపాయిలు తీసి ఇచ్చాను.

"చాలా థ్యాంక్సు... మీ అడ్రసు కూడా ఇవ్వండి. ఇంటికి చేరగానే డబ్బు పంపేస్తాను" అన్నది.

"శ్రమ ఎందుకులెండి! స్వల్పమేగా..." అంటూ నా అడ్రస్ ఇచ్చాను.

ఇదంతా అయేసరికి రైలు వొచ్చేసింది.

ఆమె తనని లేడీస్ కంపార్టుమెంట్‌లో ఎక్కించమన్నది. నేను అలాగ చేసి, ప్లాట్ ఫారమ్‌మీద నిలబడ్డాను-వెడతానని చెప్తూ,

ఇందాకటి ముష్టివాడు కర్రచప్పుడు చేసుకుంటూ వచ్చి, "ధర్మంబాబూ!" అన్నాడు. మా ఇద్దరిప్రక్కా నిలబడి.

చేతిలో ఉన్న అయిదు రూపాయిల నోటు వాడికి ఇచ్చేసింది ఇందిర.

"అదేమిటి?"అన్నాను నిజంగా ఆశ్చర్యపడి.

"ఏమిలేదులెండి...మీరు వాడిని బాధించిన దానికి, చిన్న కాంపెన్‌సేషన్...మీరు కథలు రాస్తారు. డబ్బు వొస్తుంది. నేను కథ చెప్పి, డబ్బు ఆర్జించి, వాడికిచ్చాను. అదంతా ఓపికగా వినినందుకు ధన్యవాదాలు ... కొంచెం జాలీ, ధర్మమూ అలవాటుచేసుకోండి... సెలవు."

రైలు కదులుతోంది. ముష్టివాడు తెల్లబోయి చూస్తున్నాడు. ఒక్కక్షణం తెల్లబోయి, నేను కదులుతూన్న మరో కంపార్టుమెంట్ యెక్కిపోయాను. స్టేషన్ దాటేదాకా ఆ ముష్టివాడి ఆశ్చర్యాన్ని గమనిస్తోనే ఉన్నాను.

ఇందిర తెలివైనదే-కాని తన కల్పనలో కథ వుందనీ, దానిని ఉపయోగించుకోవచ్చుననీ ఆమెకి తెలీదు. ఆమె అజ్ఞానానికి నేనూ, నా అజ్ఞానానికి ఆమే బహుశా ఇలాగ జాలిపడుతూ ఉంటామని అనుకుంటాను. అయితే జరిగిన అంతటిలోనూ నాకు ఒకటే అసంతృప్తి—ఇందిర ఎవరూ? అని.

---

యువకుడు కొత్తగా సైన్యంలో చేరి తర్ఫీదు పొందుతున్నాడు. అంతా కష్టంగా, అయోమయంగా ఉంది. ఇంతలో పై ఆఫీసరు పటాలం తనిఖీకి వచ్చాడు. తనిఖీ పూర్తయాక, సిపాయిల్నిచూసి "మీరు చెప్పుకోవలసిన కష్టాలేమైనా ఉంటే చెప్పండి!" అన్నాడు. యువకుడు ధైర్యంచేసి నెమ్మదిగా "మాకిచ్చే భోజనంలో మట్టి ఎక్కువగా ఉంది సార్" అన్నాడు. ఆఫీసరు గుడ్లెర్రచేసి "నువ్వు సైన్యంలో చేరింది మాతృభూమిని సంరక్షించడానికా లేక మస్తుగా తిండి తినడానికా?" అని ప్రశ్నించేసరికి, యువకుడు "మాతృభూమిని సంరక్షించడానికే నండి—కాని దాన్ని తినెయమంటే ఎలాగ?" అన్నాడు.